# సర్వీసు రోడ్డు నుంచి ఓఆర్ఆర్ పైకి..

- సాఫీగా రాకపోకల కోసం ర్యాంపుల నిర్మాణం
- ట్రాఫిక్ తీరుతున్నదంటున్న వాహనదారులు

సిటీబ్యూరో, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్య నివారణకు కొత్త రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించింది. రోజు రోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని ఆయా ప్రాంతాల్లో ప్రత్యామ్నామ మార్గాలను త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చేలా పురపాలక శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ముఖ్యంగా 9 ఏళ్లలో ఐటీ కారిడార్ మాదాపూర్, రాయదుర్గం, గచ్చిబౌలి వైపు నుంచి ఫైనాన్సియల్ డిస్ట్రిక్, కోకాపేట, పుప్పాల్‌గూడ వరకు విస్తరించడంతో నానక్‌రాంగూడ ఔటర్ రింగు రోడ్డు ఇంటర్ చేంజ్ వద్ద ట్రాఫిక్ రద్దీ గణనీయంగా పెరిగింది. దీంతో ఔటర్ మీదుగా వచ్చే వాహనాలకు తోడు, కోర్ సిటీ నుంచి వచ్చే వాహనాలతో నానక్‌రాంగూడ ఇంటర్‌చేంజ్ వద్ద ఇరువైపులా ఉన్న రోటరీ వద్ద ట్రాఫిక్ జామ్ సమస్య నిత్యం ఇబ్బంది పెట్టింది. ఈ విషయాన్ని గుర్తించిన హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) అధికారులు ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇందులో మొదటగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి వచ్చే వాహనాలను నానక్‌రాంగూడ ఓఆర్ఆర్ ఇంటర్‌చేంజ్ వరకు రాకుండా.. నార్సింగి వద్ద ఒక ఇంటర్‌చేంజ్‌ను నిర్మించారు. మరో ర్యాంపును నానక్‌రాంగూడ ఓఆర్ఆర్ టోల్‌ప్లాజా దాటిన వెంటనే నిర్మించి, అక్కడి నుంచి ఫైనాన్సియల్ డిస్ట్రిక్‌లోకి వెళ్లేలా కొత్త మార్గాలను అందుబాటులోకి తెచ్చారు. అదే సమయంలో నార్సింగి నుంచి గచ్చిబౌలి వైపు సర్వీసు రోడ్డు మీదుగా వెళ్లే వాహనాలను నానక్‌రాంగూడ ఇంటర్‌చేంజ్ మీదుగా వెళ్లకుండా ఉండేందుకు నానక్‌రాంగూడ ఓఆర్ఆర్ టోల్‌ప్లాజా దాటిన వాహనాలను ఓఆర్ఆర్ ప్రధాన రహదారి పైకి వెళ్లే విధంగా మరో లింకు రోడ్డును నిర్మించారు. దీంతో నానక్‌రాంగూడ ఇంటర్‌చేంజ్ వద్ద ట్రాఫిక్ చిక్కులు క్రమంగా తగ్గుముఖం పట్టాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి.. నార్సింగి, మంచిరేవుల, కోకాపేట ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు టోల్ ప్లాజా దాటిన తర్వాత ఓఆర్ఆర్ పైకి వెళ్లి.. అక్కడ గచ్చిబౌలి చౌరస్తా మీదుగా మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం, జూబ్లీహిల్స్, మియాపూర్ వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు సులభమైందని వాహనదారులు చెబుతున్నారు. హెచ్ఎండీఏ అధికారులు ఔటర్ రింగు రోడ్డును అనుసంధానిస్తూ చేపట్టిన కొత్త మార్గాలు ట్రాఫిక్ రద్దీ నుంచి ఊరట కలిగిస్తున్నాయని వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నానక్‌రాంగూడ ఓఆర్ఆర్ టోల్‌ప్లాజా దాటిన తర్వాత కొత్తగా ర్యాంపును నిర్మించిన హెచ్ఎండీఏ

## ఫ్రాన్స్ - భారత్‌ల మధ్య అవగాహన



ఐహెచ్ఈఎంఐ ప్రతినిధి బృందం ఆదివారం డీజీపీ కార్యాలయాన్ని సందర్శించింది. ఫ్రాన్స్ – భారత్ దేశాల మధ్య పరస్పర అవగాహన, సహకారాన్ని పెంపొందించడం, సంబంధాలను బలోపేతం చేయడంపై చర్చించినట్టు డీజీపీ అంజనీ కుమార్ ఎక్స్ (ట్విటర్) వేదికగా చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీజీలు మహేశ్ భగవత్, సంజయ్ కుమార్ జైన్, విజయ్ కుమార్, శిఖా గోయెల్, సౌమ్య మిశ్రా, నగర కమిషనర్ సందీప్ శాండిల్య పాల్గొన్నారు.


## ఘనంగా 13వ అమెరికా తెలుగు సాహితీ సదస్సు

- రెండురోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు
- కిరణ్ ప్రభ, క్రాంతి దంపతులకు జీవన సాఫల్య పురస్కారం

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): పదమూడవ అమెరికా తెలుగు సాహితీ సదస్సు ఘనంగా నిర్వహించారు. అమెరికా కాలిఫోర్నియాలోని సిలికానాంధ్ర వర్సిటీ ప్రాంగణంలో రెండు రోజుల పాటు ఈ సదస్సు జరిగింది. ఇందులో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, సిలికానాంధ్ర వర్సిటీ తెలుగు శాఖ సంయుక్త నిర్వహణలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ప్రముఖ రచయితలు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కొలకలూరి ఇనాక్ పాల్గొన్నారు. సుమారు వెయ్యి మంది రచయితలు, కవులు, పండితులు, సాహితీవేత్తలు, భాషా, సాహిత్యాభిమానులు హాజరయ్యారు. 50 మంది సాహితీవేత్తలు వైవిధ్యమైన అంశాలను వివరించారు. హరికథల నుంచి కవిత్వంలో గణితం వరకు ఆసక్తికరమైన ప్రసంగాలు చేశారు. సత్యం మందపాటి, రాధిక నోరి, వేమూరి వెంకటేశ్వర్లు, కే గీత, కొండపల్లి నిహారిణి, ఫణి డొక్క, భాస్కర్ రాయవరం తదితరుల ప్రసంగాలు ఆకట్టుకొన్నాయి. ఈ సందర్భంగా అమెరికాలోని తెలుగు రచయితల సమాహారంతో రూపొందిన 'అర్ధశతాబ్దిలో అమెరికా తెలుగు కథలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ కవి కిరణ్ ప్రభ, క్రాంతి దంపతులకు జీవన సాఫల్య పురస్కారం అందించారు. ఆనంద్ కూచిభొట్ల, వంగూరి చిట్టెన్ రాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆచార్య మృణాళిని, హనిమిరెడ్డి లక్కిరెడ్డి, రాజు చామర్తి తదితరులు పాల్గొన్నారు.

## కొండా వర్సెస్ బీజేపీ..!
# కమలం మదిలో కలవరం.!

- అగ్రనాయకుల మధ్య చిచ్చు రేపిన పొత్తు
- జన సేన పొత్తుపై కొండా అసహనం
- పట్టించుకోని అధిష్ఠానం
- శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి టికెట్లను ఆశిస్తున్న జన సేన
- శేరిలింగంపల్లి టికెట్‌ను తన అనుచరుడికి ఇప్పించేందుకు కొండా పట్టు
- వేర్వేరుగా సమావేశమైన ఆశావహులు



సిటీబ్యూరో, అక్టోబర్ 29 ( నమస్తే తెలంగాణ ) : జనసేన పొత్తు బీజేపీలో అగ్గి రాజేస్తున్నది. ఉనికే లేని జనసేనతో పొత్తు అవసరం లేదని కమలం క్యాడర్ వ్యతిరేకిస్తుండగా.. అధిష్ఠానం మాత్రం పొత్తు ఉంటుందని తెగేసి చెబుతున్నది. ఇదిలా ఉండగా.. ఇప్పుడు జనసేన పొత్తు బీజేపీలోని అగ్రనాయకుల మధ్య కూడా చిచ్చు రేపింది. మాజీ పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ నాయకుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి జనసేన పొత్తును వ్యతిరేకిస్తున్నట్టు సమాచారం. పొత్తులో భాగంగా గ్రేటర్‌లో శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి సీట్లు తప్పకుండా తమకే ఇవ్వాలని జనసేన పట్టుబడుతున్నది. దీంతో ఇప్పటికే ఆ నియోజకవర్గాల్లో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసుకుని.. ప్రచారం చేసుకుంటున్న ఆశావహులు డీలా పడిపోయారు. ఇన్నేండ్లు పార్టీ కోసం కష్టపడితే సీట్లు వేరే పార్టీకి కేటాయించడమేంటని వారు కమలంపై విరుచుకుపడుతున్నారు. శేరిలింగంపల్లి టికెట్‌ను రవికుమార్ యాదవ్ కోరుతుండగా, కూకట్‌పల్లి టికెట్‌ను మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి కావాలని దరఖాస్తు చేసుకున్నారు. కానీ, వీరిద్దరనీ కాదని వేరేవారికి అప్పగించడంపై రాష్ట్ర కమలం అధిష్ఠానం యోచిస్తున్నది. దీంతో తన పార్లమెంట్ స్థానంలో ఉన్న శేరిలింగంపల్లి టికెట్‌ను రవి కుమార్‌కే ఇవ్వాలని కొండా విశ్వేశ్వర్ రెడ్డి పట్టుబడుతున్నట్టు సమాచారం. దీనిపై కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ను కూడా కలిసినట్టు తెలిసింది. కానీ, వారు మౌనం వహించడంతో ఏం చేయాలో తెలియక కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఇతర పెద్దలను కలుస్తున్నారని, వారు కూడా పొత్తులో భాగంగా తీసుకునే నిర్ణయాలను వ్యతిరేకించడం కుదరదని చెప్పినట్టు సమాచారం. దీంతో కొండా నారాజయ్యాడంటూ ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. దీంతో శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి బీజేపీ నాయకులు వేర్వేరుగా సమావేశాలు పెట్టుకుని పార్టీ మారడమా.? టికెట్ దక్కించుకోవడామా.? అనే అంశాలపై పునరాలోచిస్తున్నట్టు తెలిసింది.



రాజ శ్యామలాదేవి మందిరంలో..

## జమ్మి చెట్టు నాటిన ఎంపీ సంతోష్

జూబ్లీహిల్స్, అక్టోబర్ 29: హైదరాబాద్ కోకాపేట్‌లోని శారదా పీఠం వారి ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న రాజ శ్యామలాదేవి మందిరం ఆవరణలో విశాఖ శ్రీశారద పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి వారితో కలిసి రాజ్యసభ సభ్యులు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఫౌండర్ జోగినపల్లి సంతోష్ కుమార్ జమ్మి చెట్టును నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రావుల శ్రవణ్ కుమార్ రెడ్డి, వంశీధర్ రావు, వేద పండితులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేశా..ఆశీర్వదించండి



ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్న పద్మారావు గౌడ్ తదితరులు

సికింద్రాబాద్, అక్టోబర్ 29: సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని..మరోసారి ఆశీర్వదించాలని శాసనసభ డిప్యూటీ స్పీకర్, అభ్యర్థి తీగుళ్ల పద్మరావుగౌడ్ అన్నారు. ఆదివారం మెట్టుగూడ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచార పాదయాత్ర నిర్వహించారు. ముందుగా మెట్టుగూడ చౌరస్తాలోని స్కైలాబ్ హోటల్ వద్ద పార్టీ జెండాను నగర డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, కార్పొరేటర్లు హేమ, శైలజ, సునీత, ప్రసన్నలక్ష్మి, పద్మారావు గౌడ్ తనయులు కిశోర్‌గౌడ్, కిరణ్‌గౌడ్, రామేశ్వర్‌గౌడ్, త్రినేత్రగౌడ్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం పద్మారావు గౌడ్ మాట్లాడుతూ... సికింద్రాబాద్ ప్రజలను ఓటు అడిగే హక్కు తమకే ఉందన్నారు. కరోనా సమయంలో ప్రజలను అన్ని వేళలా ఆదుకున్నామని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఘనత కూడా తమకే దక్కుతుందన్నారు.

## బీఆర్ఎస్‌లోకి బీజేపీ నేత నందు



నందు కుమార్‌కు గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట, అక్టోబర్ 29: నల్లకుంట డివిజన్ గోల్నాక కూరగాయల మార్కెట్ భాగ్యనగర్‌కు చెందిన బీజేపీ డివిజన్ సీనియర్ నేత నందు కుమార్ (నందు) ఆదివారం సాయంత్రం బీఆర్ఎస్‌లో చేరారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తన అనుచరులు 200 మందితో పార్టీలో చేరగా, వారందరికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గులాబీ కండువాను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, అంబర్‌పేట నియోజకవర్గంలోజరిగిన సంక్షేమాభివృద్ధిని చూసి చాలా మంది బీజేపీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని చెప్పారు. బీజేపీలో సరైన గుర్తింపు లేకపోవడంతో నిరాశకు గురైన పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లోకి వస్తున్నారన్నారు. వారందరిని తన గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని తెలిపారు. పార్టీలో చేరిన నందు కుమార్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజలకు చేస్తున్న సహాయ, సహకారాలు చూసి బీఆర్ఎస్‌లోకి చేరుతున్నానని పేర్కొన్నారు. ఆయనతో పాటు నాయకులు బాలరాజు, నాగరాజు, రమ్య, యాదగిరి, రవి కుమార్, సాయి, భరత్ తదితరులు కూడా పార్టీ కండువాను కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి భాస్కర్ గౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.